క్లుప్తంగా

చెస్ పోటీలు ప్రారంభం



చెస్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): ప్రపంచ చెస్ దినోత్సవం సందర్భంగా అండర్–15 నంద్యాల జిల్లా స్థాయి బాలబాలికల ఎంపిక పోటీలను గురువారం రోటరీ క్లబ్ నంద్యాల ప్రెసిడెంట్ దండె దస్తగిరి ప్రారంభించారు. స్థానిక చెరువు కట్ట వద్ద ఎస్‌పీఎస్ రోటరీ భవన్‌లో ప్రపంచ చెస్ దినోత్సవం సందర్భంగా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా వాసి సీనియర్ క్రీడాకారుడు నౌషద్‌ఖాన్‌ను సత్కరించారు. సీనియర్ రొటేరియన్స్ సుబ్బరామయ్య, సుధామోహన్‌రెడ్డి, నాగరాజరావు, సుధాప్రసాదరెడ్డి, కండె హరినాథ్, ఆర్బిటర్లు సుజాత, రవినాయక్ పాల్గొన్నారు.

కేడీసీసీబీ చీఫ్ మేనేజర్‌గా రేణుక

శిరివెళ్ల: కేడీసీసీబీ బ్రాంచ్‌లో భారీగా బదిలీలు జరిగాయి. చీఫ్ మేనేజర్‌గా రేణుక నియమితులయ్యారు. గత చీఫ్ మేనేజర్ పులిరాజు ఆత్మకూరుకు బదిలీ కావడంతో ఈ నియామకం జరిగింది. గత సూపర్ వైజర్ సుబ్బరాయుడు కోవెలకుంట్లకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో రామసుబ్బయ్య నియమితులయ్యారు. అసిస్టెంట్ మేనేజర్ కావ్య వెలుగోడుకు బదిలీ కాగా, నూతన మేనేజర్‌గా షేక్షావలి అవుకు నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

పకడ్బందీగా ఓటరు నమోదు

ఉయ్యాలవాడ: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండలంలో ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపడుతున్నట్లు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బీఎల్‌ఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు బూత్ లెవెల్ అధికారులు గ్రామంలో ఇంటింటా తిరిగి ఓటర్ నమోదుపై అవగాహన కల్పించాలన్నారు. జనవరి 2024కు 18 సంవత్సరాలు నిండే యువతీ, యువకులు ఓటు హక్కు నమోదుకు అర్హులన్నారు. అలాగే నమోదు కార్యక్రమంలో భాగంగా ఓటర్లకు సంబంధించిన మార్పులు చేర్పులు వంటి కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ తులసీకృష్ణ, ఆర్‌ఐ సత్తార్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న శస్త్ర చికిత్సల శిబిరం

నంద్యాల టౌన్: స్థానిక మధుమణి నర్సింగ్ హోమ్‌లో సోమవారం నుంచి 32వ ఉచిత చెవి, ముక్కు, గొంతు శస్త్ర చికిత్సల శిబిరం కొనసాగుతుందని డాక్టర్ మధుమణి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ సోమవారం రోగులను ఎంపిక చేసి అవసరమైన పరీక్షలు నిర్వహించి మంగళవారం నుంచి రోజుకు 15 ఆపరేషన్ల చొప్పున నిర్వహిస్తున్నామన్నారు. గురువారం సాయంత్రానికి 50 మందికి ఆపరేషన్లు విజయవంతంగా పూర్తి చేశామని చెప్పారు. ఈ నెల 23వ తేదీ వరకు వంద శస్త్ర చికిత్సలు ఉచితంగా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రతిరోజు ఓపీడీలో 250 మంది రోగుల్ని పరీక్షించి మందులను ఉచితంగా ఇస్తున్నామని పేర్కొన్నారు.

సంతాపం

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లా రవాణా శాఖ కార్యాలయ ఉద్యోగి ఇంద్రసేనారెడ్డి ఈనెల 6న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గురువారం ఆర్‌టీఓ కార్యాలయంలో ఆర్‌టీఓ శివారెడ్డి ఆధ్వర్యంలో సంతాప సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంవీఐలు తిమ్మరుసునాయుడు, రవిశంకర్‌నాయక్, ఏఓ స్వర్ణకుమారితో కలిసి ఆర్‌టీఓ.. ఇంద్రసేనారెడ్డి మృతికి సంతాపం తెలిపి నివాళులర్పించారు. ఆర్‌టీఓ మాట్లాడుతూ ఇంద్రసేనారెడ్డి కుటుంబ సభ్యులు మానవతా దృక్పథంతో ఆయన అవయవాలను దానం చేసి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు.

నేడు ఆర్టీసీ గ్రీవెన్స్ డే

నంద్యాల(వ్యవసాయం):స్థానిక డిపోలో ఆర్టీసీ ఉద్యోగులకు శుక్రవారం గ్రీవెన్స్ డేను ఏర్పాటు చేస్తున్నట్లు డిపో మేనేజర్ గంగాధర్‌రావు గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రతి నెల 3వ శుక్రవారం ఆర్టీసీ ఉద్యోగులకు సమస్యల పరిష్కార దినంగా ప్రభుత్వం నిర్ణయించినట్లు చెప్పారు. ఉద్యోగులు తమ సమస్యలను అర్జీ రూపంలో డిపో మేనేజర్ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

రుద్రవరం:స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ బాల స్వామి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి గురువారం తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

డాక్టరేట్ ప్రదానం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఎస్‌వీఆర్ ఇంజినీరింగ్ కళాశాల సివిల్ ఇంజినీర్ అధ్యాపకుడు బోరెడ్డి సూర్యప్రకాష్‌రెడ్డికి బెంగళూరులోని క్రీస్తు డిమ్డ్ యూనివర్సిటీ 'అప్లికేషన్ ఆఫ్ హైడ్రోజన్ ఇన్ ప్యాడీ ఫీల్డ్ ఫర్ సాయిల్ మాయిశ్చర్ రిటెన్షన్ అండ్ ఇల్డ్ అప్టిమైజేషన్' అనే అంశంపై పరిశోధన చేసి సమర్పించినందుకు యూనివర్సిటీ డాక్టరేట్ అందజేసిందని కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ దినేష్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మల్లికార్జునరెడ్డి గురువారం తెలిపారు.

☛ గడివేముల మండలం, పెసరవాయి గ్రామానికి చెందిన ఎల్ల నాగిరెడ్డి గతేడాది ఖరీఫ్‌లో 5 ఎకరాల్లో సోయాబీన్ విత్తనం తెలిసిన వారి నుంచి లూజుగా క్వింటా రూ.10వేలకు కొని నాటాడు. అయితే మొలక ఊసే లేకుండా పొలం బీడుగా దర్శనమిచ్చింది. ఎన్ని రోజులు గడిచినా గింజ నుంచి మొలక రాలేదు. మోసపోవడంతో పాటు విత్తనా కొనుగోలు, సాగు చేయడానికి వెచ్చించిన సొమ్ము, పంట కాలం వృథా అయ్యింది. దీంతో వ్యవసాయ అధికారుల సూచన మేరకు కంపెనీ విత్తనాలు వేయగా పంట బాగా దిగుబడి వచ్చింది.

☛ ఓర్వకల్ మండలంలోని గుట్టపాడు గ్రామానికి చెందిన రైతు నరేష్.. తెలిసిన వ్యక్తి నుంచి గతేడాది లూజు పత్తి విత్తనాలు కొని 10 ఎకరాల్లో నాటాడు. అయితే నాలుగు ఎకరాల్లో కాయలు లేవు. విక్రయించిన వ్యక్తిని ప్రశ్నిస్తే ఇందులో విత్తన లోపం లేదని, మీరే సరిగా సాగు చేయలేదేమోనని మాట మార్చేశాడు. అధికారులను సంప్రదించి సమస్యను వివరిస్తే ఆధారాలు లేకపోవడంతో ఏమీ చేయలేమని చెప్పారు. ఇలా వీరు మాత్రమే కాదు. జిల్లాలోని చాలా మంది రైతులు ఇలా నష్టపోయారు.

విడి విత్తనాలతో నష్టమే

- రైతన్నలూ..దళారుల మాటలు నమ్మి లూజు విత్తనాలు కొనొద్దు
- వాటితో నష్టం వస్తే పరిహారం శూన్యం
- అప్రమత్తంగా లేకపోతే పెట్టుబడి వ్యయం, పంటకాలం వృథా
- రైతుభరోసా కేంద్రాల్లో సమృద్ధిగా రాయితీ విత్తనాలు
- విత్తన సంచులు, ఇతర పత్రాలు భద్రపరచుకోవాలి

రెండు నెలల నుంచి విత్తన దళారులు గ్రామాల్లో పర్యటిస్తున్నారు. తాము సూచించిన విత్తనాలు వాడి పలానా గ్రామానికి చెందిన రైతులకు ఇంత లాభం వచ్చింది, భారీగా పంట పడింది అంటూ మాయ మాటలతో అన్నదాతలను తమ బుట్టలో వేసుకొని లూజు విత్తనాలను అంటగట్టి సొమ్ము చేసుకుంటున్నారు. గతేడాది ఆళ్లగడ్డ, గడివేముల, నంద్యాల, రుద్రవరం,ఓర్వకల్ తదితర మండలాల్లో మధ్యవర్తుల నుంచి పత్తి విత్తనాలు కొని సాగు చేయగా.. మొక్కలు ఏపుగా పెరిగినా కాయలు, పూత లేక పోవడంతో రైతులు వేలాది ఎకరాల్లో పంటను దున్నేశారు. విక్రయదారులను ప్రశ్నించగా తమకు కంపెనీ వారు ఇచ్చారని, తామేమీ చేయలేమని చేతులెత్తేయడంతో రైతులు భారీగా నష్టపోయారు.

నంద్యాల(సెంట్రల్): ఖరీఫ్ సీజన్ ఆరంభమైంది. అన్నదాతలు పంటల సాగులో బిజీగా ఉన్నారు. ఇప్పటికే కొంతమంది రైతులు విత్తనాలు కొనుగోలు చేయగా, మరికొందరు వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వేచి చూస్తున్నారు. విత్తన కొనగోళ్లలో జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. దళారుల మాటలు నమ్మి ఎట్టి పరిస్థితుల్లోనూ విడిగా (లూజు) విక్రయించే విత్తనాలు కొనుగోలు చేయొద్దని చెబుతున్నారు. ప్యాక్ చేసిన, లూజుగా అమ్మే వాటికి మధ్య తేడాలు తెలుసుకుంటే మోసగాళ్ల వల నుంచి తప్పించుకోవచ్చు. గతంలో ఎవరో వేశారని, దిగుబడులు బాగా వచ్చాయని, బంధువులు సిఫారసు చేశారని నమ్మి కొనుగోలు చేస్తే పెట్టుబడితో పాటు పంట కాలం నష్టపోవాల్సి వస్తుంది. అంతే గాకుండా అనధికార విత్తనాలకు చట్టబద్ధ పరిహారం లభించదని, ఒకవేళ విక్రయదారుపై కేసు నమోదు చేయించినా విత్తనాలకు సంబంధించిన ఆధారాలు లేకపోయిన కారణంగా కంపెనీల నుంచి పరిహారం పొందలేరు. కేవలం విత్తనాభివృద్ధి సంస్థలు లేదా పరిశోధన సంస్థలు, లైసెన్స్ కలిగిన డీలర్ నుంచి విత్తనాలు మాత్రమే కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసినప్పటి బిల్లులు, లేబుళ్లు, విత్తనాల ప్యాకెట్లను భద్రపరుచుకుంటే పంట నష్టపోయిన సమయంలో వాటి ఆధారంగా పరిహారం సులభంగా పొందవచ్చు.

లూజ్ విత్తనాలు..

☛ ఈ విత్తనాలకు నాణ్యత ఉండదు.

☛ వీటి తయారీలో కంపెనీ నుంచి ధ్రువీకరణ, అధికారుల ప్రమేయం ఉండదు.



నాణ్యతా ప్రమాణాలు లేని లూజ్ విత్తనాలు

☛ విడిగా అమ్మే విత్తనాలు కొనుగోలు చేసిన సమయంలో ఎటువంటి బిల్లు ఇవ్వరు.

☛ ప్రాసెసింగ్, శుద్ధి తదితర ప్రమాణాలుండవు

☛ ఈ విత్తనాలు విత్తాక పంట మధ్యలో పూత, కాయ దశలో నష్టాలు జరిగితే రైతులకు నష్ట పరిహారం అందదు.

☛ వీటికి జన్యు నాణ్యత ఉండదు.

కంపెనీ విత్తనాలు..

☛ ఈ విత్తనాలకు పూర్తి స్థాయి నాణ్యతా ప్రమాణాల ధృవీకరణ ఉంటుంది.

☛ తయారీలో వివిధ దశల్లో కంపెనీ ప్రమేయం, అధికారుల పర్యవేక్షణ ఉంటుంది.

☛ విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పకుండా బిల్లు ఇస్తారు.

☛ విత్తన తయారీలో ప్రాసెసింగ్, శుద్ధి, ఇతర నాణ్యతా ప్రమాణాలు పాటిస్తారు.

☛ విత్తిన తర్వాత జరిగే నష్టాలకు పరిహారం అందే న్యాయం జరుగుతుంది.



నాణ్యత కలిగిన ప్యాకేజ్డ్ విత్తనాలు

☛ అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసినందువల్ల జన్యు నాణ్యతలో రాజీ ఉండదు.

☛ ప్రభుత్వ అనుమతితో లైసెన్స్ పొందిన డీలర్లు మాత్రమే విక్రయిస్తారు.

ఆర్బీకేల్లో సమృద్ధిగా ప్రభుత్వ విత్తనాలు

నంద్యాల సబ్‌డివిజన్‌కు సంబంధించి ప్రస్తుత ఖరీఫ్‌నకు మొత్తం 2,585 క్వింటాళ్ల విత్తనాల కోసం ప్రతిపాదనలు పంపగా 2,148 క్వింటాళ్ల విత్తనాలను ప్రభుత్వం కేటాయించింది. ఇందులో 145.5 క్వింటాళ్ల కందులు, 10 క్వింటాళ్ల మినుములు, 1,933 క్వింటాళ్ల జీలుగ, 60 క్వింటాళ్ల పిల్లిపెసర ఉన్నాయి. వీటితో పాటు మంచి నాణ్యతతో కూడిన వరి విత్తనాలు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, మహానంది వ్యవసాయ కళాశాల, యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రంలో కర్నూలు, నంద్యాల సోనా రకాలు అందుబాటులో ఉంచారు.

లూజ్ విత్తనాలు అమ్మితే సమాచారమివ్వండి



ప్యాకేజ్డ్ విత్తనాలు కొనుగోలు చేసిన తర్వాత కర్షకులు ప్రతి సంచి నుంచి కొన్ని విత్తనాలు తీసి మొలక కట్టుకోవాలి. దీనివల్ల ముందే అవి నాణ్యమైనవా, కల్తీవా అనేది పసిగట్టవచ్చు. నాసిరకమైతే వ్యవసాయాధికారులకు తెలిపితే, వాటి స్థానంలో మంచి వాటిని దుకాణాదారులతో మార్పించి ఇవ్వటంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకోవటానికి వీలవుతుంది.విత్తన సంచులు పారవేయకుండా లేబుళ్లు, బిల్లులు, ఇతర పత్రాలు భద్రపరచుకోవాలి. దీనివల్ల నష్టపరిహారం పొందటానికి, న్యాయస్థానాల్ని ఆశ్రయించటానికి అవకాశముంటుంది. ఇక లూజ్ విత్తనాల అమ్మకాలకు ఎటువంటి అనుమతులు లేవు. ఎవరైనా అమ్మకాలు సాగిస్తే కఠిన చర్యలు తప్పవు. ఖరీఫ్‌నకు సంబంధించి సంతృప్తకర స్థాయిలో విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. అన్నదాతలు ఏ విత్తన రకం కావాలన్నా సంబంధిత ఆర్‌బీకేల్లోని వ్యవసాయ సహాయకుల్ని సంప్రదించాలి. దళారులను, మోసపూరిత ప్రకటనలను నమ్మి రైతులు మోసపోవద్దు.

– హేమసుందరరెడ్డి, ఇన్‌చార్జి ఏడీఏ, నంద్యాల

న్యాయం చేయండి సారూ..



సురక్ష కార్యక్రమంలో డీటీ విజయ్‌కుమార్‌కు వినతి పత్రం అందిస్తున్న రైతులు

చాగలమర్రి: తెలుగు గంగ కాల్వలకు అవసరమైన భూమి సేకరణలో తమకు పరిహారం చెల్లించకపోయినా తమ పట్టాలను రద్దు చేసి ప్రభుత్వ భూమిగా మార్చారని, వాటికి తమ పేరుతో పట్టాలిచ్చి న్యాయం చేయాలని రైతులు కోరారు. ఈ మేరకు గురువారం పెద్దవంగలి గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. రైతులు మాట్లాడుతూ..మండలంలోని పెద్దవంగలి పరిధిలోని సర్వే నంబర్ 74లో కొందరు రైతులకు చెందిన భూములను 2006లో ప్రభుత్వం సేకరించి తెలుగుగంగ పంట కాలువను ఏటు చేసింది. అయితే ఈ సర్వే నంబరులో గల మరి కొందరు రైతులు ఈ పంట కాలువ తమకు అవసరం లేదని, తమ పొలాల్లో కాలువను నిర్మించొద్దని సంబంధిత అధికారులకు తెలిపారు. అయినా తమకు పరిహారం చెల్లించకుండా, మా పేరుమీదనున్న పట్టా భూములను రెవెన్యూ రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా మార్చారని బాధిత రైతులు నర్సయ్య, కామిశెట్టి నరసింహులు,ఆది శేషయ్య, గోరంట్ల గురప్పా, బావద్దీన్, మొగలిశెట్టి శేషయ్య, బి.షరీఫ్, ఎం.శేషాచలపతి, పాపయ్య, వై.సుబ్బరాయుడు, దస్తగిరి ఆవేదన వ్యక్తం చేశారు. డీటీ విజయకుమార్ మాట్లాడుతూ నష్టపరిహారం ఇవ్వలేదని తెలుగుగంగ అధికారుల నుంచి ధ్రువ పత్రం తీసుకొస్తే రికార్డుల్లో మీ పేరుతో నమోదు చేస్తామని చెప్పారు.

పరామర్శ

ఆళ్లగడ్డ: అనారోగ్యంతో నంద్యాలలో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు యాదవాడ శంకర్‌రెడ్డిని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి గురువారం పరామర్శించారు. శంకర్‌రెడ్డి తీవ్ర అస్వస్థతకు గురికావడంతో ఆళ్లగడ్డ వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం నంద్యాలలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లిన విషయం తెలిసిన ఎమ్మెల్యే నంద్యాలకు వెళ్లి పరామర్శించి మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను కోరారు. ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, యాదవాడ నరసింహారెడ్డి ఉన్నారు.

పేదల కుటుంబాల్లో సంక్షేమ వెలుగులు



మహిళకు సంక్షేమ పథకాలను తెలిపే బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పారవి

గోస్పాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో నిరుపేదల కుటుంబాల్లో వెలుగులు నిండాయని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం గోస్పాడులో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ప్రహ్లాద రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత నియోజకవర్గంలో సంక్షేమం, అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నామని తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చి ప్రజల వద్దకు ప్రజాప్రతినిధులు వచ్చేలా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర సోషల్ మీడియా కో–ఆర్డినేటర్ మధుసూదన్ రెడ్డి, ఎంపీపీ ఆర్థర్ సైమాన్, ఉప మండల అధ్యక్షుడు రాజు, నాయకులు అశోక్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, వివేకానందరెడ్డి, లింగారెడ్డి, శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

అవసరమైన రైతులందరికీ బిందుసేద్య పరికరాలు

నంద్యాల(సెంట్రల్): జిల్లావ్యాప్తంగా బిందు, తుంపర సేద్య పరికరాల అవసరమున్న రైతులందరికీ రాయితీతో అందజేసేందుకు సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర ఉద్యాన కమిషనరేట్ నుంచి పరిశీలనకు వచ్చిన ఓఎస్‌డీ వైవీఎస్ ప్రసాద్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఏపీఎంఐపీ పథక సంచాలకుల కార్యాలయంలో 2022–23, 2023–24 సంవత్సరాలకు సంబంధించి బిందు, తుంపర సేద్యం అమలు తీరుపై.కంపెనీ ప్రతినిధులు, కార్యాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరానికి కేటాయించిన 5000 హెక్టార్ల లక్ష్యాన్ని నెలవారీగా విభజించి డిసెంబర్‌కు పూర్తి చేయాలని ఆదేశించారు. 5 ఎకరాలలోపు భూమి కలిగిన రైతులకు 90 శాతం రాయితీతో, 5 ఎకరాలు పైబడి 10 ఎకరాలలోపు వారికి 70 శాతం రాయితీతో, 12 ఎకరాలలోపు పొలం ఉన్న వారికి 45 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు అందజేయాలన్నారు. స్ప్రింకర్ల విషయంలో 5 ఎకరాలకు తక్కువ భూమి ఉన్న వారికి 55 శాతం , 12 ఎకరాలలోపు వారికి 45 శాతం రాయితీతో పరికరాలు అందించాలని సూచించారు. ఆసక్తి కలిగిన రైతన్నలు సంబంధిత ఆర్‌బీకేల్లో సంప్రదించాలని, డాక్యుమెంటేషన్ కంపెనీ ప్రతినిధులే చేస్తారని పేర్కొన్నారు. రైతు వాటా కింద చెల్లించే సొమ్మును ఫోన్‌పే ద్వారా నేరుగా మైక్రోఇరిగేషన్ సంస్థకు చెల్లించే సౌకర్యం ఉందన్నారు.

అటవీ అధికారిపై ఫిర్యాదు

రుద్రవరం: రుద్రవరం రేంజి పరిధిలోని నూతల సెక్షన్ అధికారి శ్రీనివాసరెడ్డిపై మండలంలోని హరినగరానికి చెందిన చిన్నయ్య అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చిన్నయ్యతో పాటు మరి కొందరు బుధవారం తెల్లవారు జామున అడవిలోకి వెళ్తుండగా అటవీ అధికారులు వారిని అడ్డుకొని వారి నుంచి వస్తు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. దీంతో వారి మధ్య కొంత వాగ్వాదం నెలకొంది. ఈ విషయంపై చిన్నయ్య గురువారం రుద్రవరం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తనపై అటవీ అధికారులు దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయంపై ఎఫ్ఎస్ఓ శ్రీనివాసరెడ్డిని వివరణ కోరగా.. తాను ఎవరిపై దాడి చేయలేదని, అటవీ సంరక్షణలో భాగంగా వారిని అడవిలోకి వెళ్లవద్దని వారించి ఇంటికి పంపించామని తెలిపారు.

అక్రమ అరెస్టులు సరికాదు

నంద్యాల(న్యూటౌన్): అక్రమ అరెస్టులు సరికాదని ఎస్ఎఫ్ఐ నంద్యాల జిల్లా అధ్యక్షుడు డక్కా కుమార్, కార్యదర్శి కిరణ్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలో ధర్నా నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వాలని ఆందోళన చేస్తుంటే అక్రమ కేసులు బనాయించడం తగదన్నారు. ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని, జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకాన్ని అమలు చేయాలని కోరారు. జిల్లా సహాయ కార్యదర్శి రమణ, ప్రతాప్, మహేష్, సిద్ధార్థ పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత లోపించరాదు



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(సిటీ): పట్టణంలోని పద్మావతి నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న రహదారి పనులను ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పనుల్లోలో నాణ్యత లోపించరాదని, అలాగే నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. పనులు జరుగుతున్న ప్రాంతంలో వాహనచోదకులకు ఇబ్బందులు రాకుండా సూచికలు ఏర్పాటు చేసి ట్రాఫిక్ తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, ఇంజినీర్లు జయభారతరెడ్డి, మధుకుమార్ ఉన్నారు.

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి

నంద్యాల(అర్బన్): నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులతో సకాలంలో అభివృద్ధి పనులు పూర్తిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొని రావాలని ఎమ్మెల్యే శిల్పారవిచంద్ర కిశోర్‌రెడ్డి సూచించారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులకు ప్రాధాన్యతను ఇచ్చి అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. స్థానిక పీఆర్ కార్యాలయంలో గురువారం నంద్యాల నియోజకవర్గ అభివృద్ధిపై పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సచివాలయాలు, ఆర్‌బీకేలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను సకాలంలో పూర్తయ్యేలా చూడాలన్నారు. పీఆర్ ఈఈ రామ్మోహన్, డీఈ గంగాధర్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అర్హులందరికీ సంక్షేమ పథకాలు



ఇంజేడులో ధ్రువ పత్రాలను అందజేస్తున్న కర్రా గిరిజారెడ్డి, జెడ్పీటీసీ, ఎంపీపీ, అధికారులు



కౌలుకార్డును అందజేస్తున్న ఎంపీపీ, అధికారులు

ఆళ్లగడ్డ: అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందుకోలేని వారిని గుర్తించి లబ్ధి చేకూర్చడమే 'జగనన్న సురక్ష'లక్ష్యమని ఎంపీడీఓ మహబూబ్‌ఖాన్ తెలిపారు. రూరల్ మండలం జి.జమ్ములదిన్నె గ్రామ సచివాలయ పరిధిలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ పరిధిలో 807 నివాస గృహలకు గాను 663 గృహాల్లో సర్వే నిర్వహించి 188 మందికి ధ్రువ పత్రాలు అవసరమని గుర్తించి వారందరికీ ధ్రువ పత్రాలు అందజేశారు. ఈఓఆర్డీ తాహెర్‌హుసేన్, సర్పంచ్ నందీశ్వరయ్య ఉన్నారు.

ఉయ్యాలవాడ : ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల ఆశీర్వాదాలు ఉండాలని రాష్ట్ర ఐడీసీ చైర్‌పర్సన్ కర్రా గిరిజారెడ్డి, జెడ్పీటీసీ కసాని పుణ్యలక్ష్మిదేవి, ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ కోరారు. గురువారం మండలంలోని ఇంజేడు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం సర్పంచ్ రామమోహన్,ఉప సర్పంచ్ దండే పార్థసారధిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం 126 మందికి ధ్రువ పత్రాలు అందజేశారు. నాయకులు కామిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, శీలం హరిశ్చంద్ర నాగిరెడ్డి, చెన్నూరు భాస్కర్‌రెడ్డి, తహసీశీల్దార్ రవికుమార్,ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

శిరివెళ్ల: కోటపాడు గ్రామ సచివాలయంలో గురువారం జగనన్న సురక్ష శిబిరం జరిగింది. సర్పంచు దూదేకుల ఉశేన్‌బీ, కామినేనిపల్లె సర్పంచు మేర్వ చిన్న నరసింహారెడ్డి 280 మందికి వివిధ రకాల ధ్రువ పత్రాలు పంపిణీ చేశారు. వంకదార సుబ్బసత్యనారాయణశ్రేష్టి, ఉప సర్పంచు గురిజాల లీలావతి, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ షేక్ మొయిద్దీన్, ఏఓ సుధాకర్ పాల్గొనారు.

రుద్రవరం: మండలంలోని పెద్దకంబలూరు గ్రామ సచివాలయం వద్ద గురువారం ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, తహసీల్దారు రవీంద్ర ప్రసాదు వివిధ శాఖల అధికారులతో కలిసి జగనన్న సురక్ష క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా 299 మందికి ధ్రువ పత్రాలు అందజేశారు. పంచాయతీ కార్యదర్శి షాహినూర్ పాల్గొన్నారు.

చాగలమర్రి: మండలంలోని పెద్దవంగలి, మల్లేవేముల గ్రామ సచివాలయాల్లో ఎంపీడీఓ మహబూబ్ దౌలా, ఈఓపీఆర్‌డి సుదర్శనరావు ఆధ్వర్యంలో సర్పంచ్‌లు బంగారు షరీఫ్, సరోజమ్మ అధ్యక్షతన గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దవంగలిలో 236 మందికి, మల్లెవేములలో 298 మందికి ధ్రువ పత్రాలు అందజేశామని పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు గొట్లూరు గ్రామ సర్పంచ్ ఎల్.శ్రీలత, ఎంపీటీసీ సుబ్బారెడ్డి, డైరెక్టర్ గొస్పీర్, డీటీ విజయ్ కుమార్, ఏఈలు కొండారెడ్డి, జక్కరయ్య, షఫీవుల్లా, ఏపీఓ నిర్మలాదేవి పాల్గొన్నారు.

దొర్నిపాడు: జగన్న సురక్ష కార్యక్రమం ద్వారా 11 రకాల ధ్రువపత్రాలను ఉచితంగా ప్రభుత్వం అందజేస్తుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి సూచించారు. గురువారం దొర్నిపాడు సచివాలయం-1లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ శకుంతల, ఎంపీటీసీ లక్ష్మీదేవి, సచివాలయ మండల కన్వీనర్ శివా రెడ్డి, తహసీల్దార్ జయప్రసాద్, ఎంపీడీఓ సుబ్బారెడ్డి, ఏఓ సునీత, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుప్రియ, నాయకులు లక్ష్మికాంత్‌రెడ్డి, చిన్నవెంకటరామిరెడ్డి , గ్రామపంచాయతీ కార్యదర్శి నాగార్జున పాల్గొన్నారు.

నంద్యాల(అర్బన్): జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులందరికీ న్యాయం జరుగుతుందని ఎంపీడీఓ సుగుణశ్రీ , తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. నంద్యాల మండలం రాయమాల్పురం, కొత్తపల్లి గ్రామాల్లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 257 పత్రాలు అర్హులకు అందజేశారు. ఎంపీపీ శెట్టి ప్రభాకర్, డీటీ రమాదేవి, సీనియర్ అసిస్టెంట్ నాగేంద్ర, పంచాయతీ కార్యదర్శి లలిత పాల్గొన్నారు.

గోస్పాడు: మండలంలోని ఒంటివెలగల గ్రామంలో మండల స్థాయి అధికారుల ఆధ్వర్యంలో, ఎంపీపీ ఆర్థర్ సైమన్, సర్పంచ్ రాజారెడ్డి అధ్యక్షతను గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ భాస్కర్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ విజయశేఖర్ మాట్లాడుతూ 421 మందికి ధ్రువ పత్రాలు అందజేశామని చెప్పారు.

30న వృద్ధుల ఆత్మీయ సమ్మేళనం

నంద్యాల(వ్యవసాయం): ఈనెల 30వ తేదీన ఆదివారం శ్రీకాళీమాత సేవా సమాజం ఆధ్వర్యంలో అన్ని కులాలకు చెందిన వయో వృద్ధులకు ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఖాళీమాత సేవా సమాజ్ గౌరవాధ్యక్షుడు ఆరవేటి వాసు, డాక్టర్ రామకృష్ణారెడ్డి, రాంప్రసాద్ గురువారం తెలిపారు. స్థానిక కాళికాంబ దేవస్థానంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ 80సంవత్సరాలు పైబడిన వృద్ధుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపడం కోసం హైదరాబాద్‌కు చెందిన క్రియేటివ్ కృష్ణతో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వివరాలకు సెల్ : 9666891590, 9963255861 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కేసు నమోదు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): నిరుద్యోగికి ఉద్యోగం ఇప్పిస్తామని రూ.16లక్షలు తీసుకొని నకిలీ ఉద్యోగ జాయినింగ్ ఆర్డర్ ఇచ్చిన డోన్ బీజేపీ నాయకుడు రామయ్యపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాముడు కోరారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగి కుటుంబానికి న్యాయం చేయాల్సిన పోలీసులు బాధితుడికి అండగా నిలిచిన ఏఐవైఎఫ్ నాయకులపై కేసులు బనాయించడంపై తగదన్నారు.

వ్యక్తిపై దాడి- కేసు నమోదు

దొర్నిపాడు: క్రిష్టిపాడు గ్రామానికి చెందిన మహబూబ్‌దౌలా, ఆయన కుమారులు ముషారఫ్, మున్నాఫ్‌పై గురువారం కేసు నమోదు చేమని ఎస్ఐ తిరుపాల్ తెలిపారు. మహబూబ్ దౌలా హోటల్ సమీపంలో ఉన్న చేతిపంపు వద్ద మాబువలి అనే వ్యక్తి కాళ్లు శుభ్రం చేసుకుంటుండగా జరిగిన వాదనలో వారు ముగ్గురు మాబువలిపై దాడికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాది మేరకు కేసునమోదు చేశామని ఎస్ఐ చెప్పారు.

రీ-సర్వే త్వరగా పూర్తి చేయాలి



ట్యాబులతో సచివాలయ వార్డు ప్లానింగ్ సెక్రటరీలు

నంద్యాల(సిటీ): పట్టణంలో రీ-సర్వే పనులు త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా సూచించారు. గురువారం స్థానిక కార్యాలయంలో కమిషనర్ రవిచంద్రారెడ్డి ఆధ్వర్యంలో సచివాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న వార్డు ప్లానింగ్ సెక్రటరీలకు ట్యాబ్‌లు అందజేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న టెక్నాలజీని సద్వినియోగం చేసుకుని మున్సిపల్ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారుల సమన్వయంతో నిర్ణీత గడువులోగా రీ సర్వే పనులు పూర్తి చేయాలని చెప్పారు.

నిజాయితీగా సేవలు

ఉయ్యాలవాడ మండలం ఆర్.జంబులదిన్నె గ్రామంలో వలంటీర్ ప్రేమ్ కుమార్ తన పరిధిలోని 50 కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నాడు. ఎవరికి ఏ ఇబ్బంది వచ్చినా నేనున్నానంటూ ఎప్పటికప్పుడు సమస్యలు తెలుసుకుని ఆదుకుంటున్నాడు. అత్యవసర, ఆపద సమయంలో అవసరమైన ఆరోగ్య పరీక్షలు చేయించి మందులు అందజేస్తున్నాడు. దీంతో ఆ 50 కుటుంబాలకు తలలో నాలుకయ్యాడు

– ఉయ్యాలవాడ



వితంతు ఫించన్ కోసం శాంతమ్మ వివరాలను నమోదు చేస్తున్న వలంటీర్ ప్రేమ్‌కుమార్

సోదరుడిలా వలంటీర్



నా పేరు ఎం.శాంతమ్మ, నా భర్త చనిపోయాడు. టీడీపీ ప్రభుత్వంలో వితంతు పింఛన్ కోసం ఆఫీసల చుట్టూ, నాయకుల వద్దకు ఎన్ని సార్లు తిరిగినా ఎవరూ పట్టించుకోలేదు. జగనన్న వచ్చాక మా వలంటరీ ప్రేమ్‌కుమార్ మా ఇంటి వద్దకే వచ్చి రైస్ కార్డు తీసుకుని ఫించన్‌కు అప్‌లై చేశాడు. ఇప్పుడు నాకు ప్రతి నెల రూ. 2,750 పింఛన్ ఇస్తున్నారు. అలాగే నా పిల్లలకు అమ్మ ఒడి వచ్చేలా చేశాడు. పథకాల వివరాలు తెలియజేసి అర్హత ఉంటే దరఖాస్తు చేసుకోవాలని చెబుతాడు. ఏ అవసరం వచ్చిన సోదరుడిలా సాయం చేస్తున్నాడు.

– ఎం.శాంతమ్మ, ఆర్.జంబులదిన్నె